ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

గురువారం 25 జనవరి 2024

రిటైర్డ్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యం 8లో..

పరిపాలన తీరుపై విద్యార్థినులకు అవగాహన 8లో..

పార్టీలో చేరికలపై ఆచి తూచి..



- కాంగ్రెస్ వైపు చూస్తున్న వివిధ పార్టీల నేతలు
- ఎమ్మెల్యేలకు తెలియకుండానే కొందరి చేరికపై అసంతృప్తి
- పనిచేసే వారికే పదవులు, టిక్కెట్లు ఇవ్వాలంటున్న సీనియర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్, తదితర పార్టీల్లో చేరిన నేతలంతా ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తిరిగి పార్టీవైపు చూస్తున్నారు. అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని, వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టాన పెద్దలు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలిసింది. ఈనెలాఖరు లోపు రాష్ట్రంలోగల పలు కార్పొరేషన్లు, ఇతరత్రా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికలకు ముందు, ఎన్నికల వరకు కష్టకాలంలో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ కోసం నిలబడి, అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు దక్కనున్నాయని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. దీంతో పార్టీ కోసం పనిచేసిన నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని చేజిక్కించుకున్నది. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న పలువురు నాయకులు ఆపత్కాలంలో తమ వ్యక్తిగత అవసరాల కోసం పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన వాళ్లు, అధికారం కోల్పోయాక ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా కొందరు నాయకులు ఇతర పార్టీల ప్రలోభాలకు తలొగ్గి ప్యాకేజీలు తీసుకుని కండువాలు కప్పుకున్న వాళ్లున్నారు. ప్రస్తుతం ఆ నాయకులు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు హైదరాబాద్ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకొందరు నాయకులైతే నియోజకవర్గ ఎమ్మెల్యేలకు సంబంధం లేకుండానే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వద్దకు వెళ్లి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఆయననే గాకుండా ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను కలుస్తూ బొకేలు, సన్మానాలు చేస్తూ, సన్మాన పత్రాలు అందజేస్తూ తాము కాంగ్రెస్‌లోనే ఉన్నామంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు.

● సీనియర్ నాయకుల అసహనం..

కాంగ్రెస్ పార్టీ కోసం, అభ్యర్థుల గెలుపు కోసం ఏమాత్రం పనిచేయని వాళ్లంతా ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా పార్టీలో చేరడాన్ని సీనియర్ నాయకులు తప్పుపడుతున్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే, పార్టీ కోసం కష్టపడిన వాళ్లు దూరం కావాల్సి వస్తుందని, అలాంటి వారికి అడ్డుకట్ట వేయాలని కొందరు సీనియర్ నాయకులు ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లాకు పెద్ద దిక్కు అయిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి కూడా వాళ్ల తీసుకవెళ్లినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, ఎన్నికలకు ముందు పార్టీ విజయం కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకే నామినేటెడ్ పోస్టుల విషయంలో గానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చే విషయంలో మంత్రి ఇటీవల తనను కలిసిన పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు సూచించినట్లు సమాచారం. మంథని నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అలాంటి వారిని పార్టీలోకి తీసుకునేందుకు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో, అంతకు ముందు ప్రలోభాలకు లొంగకుండా పార్టీ జెండా పట్టుకుని పార్టీ కోసం పని చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తామని పార్టీ నేతలతో మంత్రి అంటున్నారని అక్కడక్కడా చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం జరగనున్న గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొందరు రాజకీయ ఊసరవెల్లులు, తమ స్వార్థం కోసం అటు, ఇటు పిల్లి మొగ్గలు వేసేవాళ్లు కాంగ్రెస్‌లో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు, ఎన్నికలకు ముందు అలాంటి వారికి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల టిక్కెట్లు తమకే ఇస్తామని హామీ ఇచ్చి ఉన్నారు. ఇప్పుడు వచ్చే వాళ్లంతా పదవులు, టిక్కెట్ల కోసం, పైరవీలు చేసేవారే వస్తున్నారు. అలాంటి వారిని పార్టీలో చేర్చుకోవద్దనే పార్టీ నాయకులు సూచిస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా అదే విధానంతో ఉన్నది.

ప్రత్యేక నిధులు కేటాయించండి

- ఆర్అండ్‌బీ శాఖ మంత్రికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వినతి



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 24: రామగుండం నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ ఎల్కలపల్లి నుంచి కన్నాల, కుక్కలగూడూరు నుంచి తక్కళ్లపల్లి, రామగుండం నుంచి రైల్వే స్టేషన్, పొట్యాల నుంచి మల్రిపల్లి, కుక్కలూగూడురు నుంచి ఇస్సంపేట, ఎంపీడీఓ కార్యాలయం నుంచి రామగుండం, పెద్దంపేట వరకు రూ.25కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లను నిర్మించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంకటరెడ్డి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతానని హామీఇచ్చినట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చెప్పారు.

రామగుండం జెన్‌కోను 800మెగావాట్లకు విస్తరించండి..

గోదావరిఖని, జనవరి 24: రామగుండం బీ పవర్‌హౌస్‌ను విస్తరించి 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలని టీఎస్‌జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తాజ్ రిజ్వీని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. బుధవారం సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన రామగుండంలో విద్యుత్ ప్లాంట్లను మూసివేస్తూ ఇక్కడ నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, 62.5 మెగావాట్ల జెన్‌కో పవర్ ప్లాంట్‌ను 800మెగావాట్లుగా విస్తరించాలని, రామగుండంలో బొగ్గు, నీరు సహజవనరులతో పాటు కావాల్సిన స్థలం ఉందని, ఇక్కడ పరిశ్రమలు స్థాపించకుండా గత ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు లేనియాదాద్రికి విద్యుత్ ప్లాంట్లను తరలించుకుపోయిందని ఆయన అన్నారు. ఇక్కడ 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ వస్తే రామగుండం వెలుగుల మయం అవుతుందని, అందులో పని చేసే ఉద్యోగులకు భరోసాతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇది దృష్టిలో పెట్టుకుని 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పాలని, దానికి కావాల్సిన అనుమతులను విస్తరణ కోసం తాను సహాయసహకారాలు అందించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు.

ఎంసీహెచ్‌లో మత్తు డాక్టర్ అవినీతిపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న డాక్టర్ శౌరయ్య

మంథని, జనవరి 24: స్థానిక మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మత్తు డాక్టర్ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు రావడంతో అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఈనెల 17న మత్తు డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌రావు మత్తు ఇంజన్ ఇవ్వడం కోసం తన వద్ద డబ్బులు చేశాడని ఆరోపిస్తూ మంథనికి చెందిన బండారి సమ్మయ్య అనేవ్యక్తి కలెక్టర్, డీసీహెచ్‌లకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై డీసీహెచ్ రామాకాంత్ ఆదేశాల మేరకు విచారణ అధికారులు డాక్టర్ శౌరయ్య, రాంమూర్తిలు ఆసుపత్రిలో విచారణ చేపట్టారు. డాక్టర్ మోహన్‌రావుతోపాటు బాధితులైన బండారి సమ్మయ్య, లింగాల సురేష్‌లతో వారు ప్రత్యేకంగా మాట్లాడటంతోపాటు లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ అనంతరం డాక్టర్ శౌరయ్య, రాంమూర్తిలు మాట్లాడుతూ.. తమ విచారణలో మత్తు డాక్టర్‌తో పాటు బాధితులతో సైతం నేరుగా మాట్లాడి వివరాలు సేకరించామని, నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు..

- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

సుల్తానాబాద్, జనవరి 24 : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఎవరైనా రోడ్లపై, మురుగు కాలువలలో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించి, సుల్తానాబాద్ మున్సిపల్‌ను స్వచ్ఛ మున్సిపల్‌గా తీర్చిదిద్దేందుకు కౌన్సిలర్లు అందరితో కలిసి సమష్టి కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో అన్నివార్డుల్లో పరిశుభ్రంగా ఉండేలా ప్రజలందరూ కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్క గృహదారుడు తమ చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోడ్లపై మురుగు కాలువలలో చెత్తను,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను వేయవద్దన్నారు. విధిగా తమ గృహాల్లో వ్యర్థ పదార్థాలను నిలువ చేసి కాలనీలకు వచ్చే స్వచ్ఛ ఆటోలకి తడి చెత్తను వేరుచేసి రోజు వారీగా, పొడి చెత్తను ప్రతి సోమవారం, శుక్రవారం అందించాలని అన్నారు. స్వచ్ఛ ఆటో సిబ్బందికి ప్రతినెలా ఒక ఇంటికి విధిగా రూ.50 రూపాయలు ఇవ్వాలని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు. నిత్యం ఆర్పీలు పర్యవేక్షిస్తారని చెత్త వేసిన వారి ఫోటోలను బంధించి వారి గృహాలకు మున్సిపల్ సిబ్బంది చేరుకొని జరిమానాలు విధిస్తారని ప్రజలందరూ చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దెందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ జవాన్ ఆనంద్‌లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లి టౌన్, జనవరి 24: జిల్లాలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు మూడు, నాలుగు నెలల నుంచి పెండింగులో ఉన్నాయని, వేతనాలు వెంటనే చెల్లించాలని జిల్లా గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. బుధవారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక శాంతినగర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు మూడు, నాలుగు నెలల నుంచి పెండింగులో ఉన్నాయని, అదేవిధంగా గత సంవత్సరం జరిగిన సమ్మె కాలపు వేతనాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించకుండా పెండింగ్లో పెట్టారని అన్నారు. బకాయి వేతనాలు, సమ్మె కాలపు వేతనాలను కార్మికులకు చెల్లించే విధంగా జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని, తద్వారా పేద కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే వారం రోజుల్లో సర్పంచుల కాలపరిమితి ముగిసి ప్రత్యేక అధికారుల పరిపాలన రానున్నందున ఈలోపే ఈ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా, వివిధ మండలాల నాయకులు మామిడిపల్లి తిరుపతి, నాగయ్య, అశోక్, నగేష్, చంద్రమౌళి, లక్ష్మణ్, స్వామి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

టీసీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా శ్రీనివాస్, మధుబాబు



శ్రీనివాస్, మధుబాబు

పెద్దపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వినియోగదారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా రంగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం మధుబాబు నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్ రామ్ కోఠిలోని బీసీ సాధికారత కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అంబురాథోడ్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 : బాలికలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవకాశాలు చాలా తక్కువగా ఉండేవని, ఆ పరిస్థితి ఇప్పుడు మారి బాలికలకు సమానంగా విద్యా అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాలికలు ఈ రంగంలో రాణించలేరు అనే అపోహలను తొలగించే దిశగా ఇక్కడ ఉన్న బాలికలంతా విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, మొదలైన వివిధ అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చిన్న వయసులోనే పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నేటి బాలికలు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, క్రీడాకారులుగా, వివిధ రంగాలలో పెద్ద స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ మనకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేస్తూనే బేసిక్ ఎడ్యుకేషన్ సాధించాలని అన్నారు. సమాజంలో మహిళలు మానసికంగా అధికంగా దృఢంగా ఉంటారని, అదే దృఢత్వంతో ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ప్రస్తుతం మనం ఉన్న భవనం ఒకే రోజులో నిర్మించలేదని, పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని 3 సంవత్సరాలు కృషి చేయడం వల్ల మనం ఉన్న భవనం ప్రస్తుత రూపం సంతరించుకుందన్నారు. అదేవిధంగా రాబోయే ఐదు, పది సంవత్సరాల్లో మనం ఏ స్థాయిలో ఉండాలనుకున్నామో నిర్దేశించుకుని దాని సాధన దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రపంచంలో ఒకే సమయం అందుబాటులో ఉంటుందని, సమయాన్ని ఎవరైతే సమర్థవంతంగా వినియోగించుకుంటారో వారే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకొని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం వేడుకలలో బాలికలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, బాల్య వివాహంపై చేసిన స్కిట్‌ను విద్యార్థినులతో కలిసి కలెక్టర్ తిలకించారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటోలు, బహుమతులను కలెక్టర్ అందజేశారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థినులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, సీడబ్ల్యూసీ చైర్మన్ శ్రీధర్, సీడీపీవోలు కవిత, స్వరూప రాణి, డీఆర్‌బీ సుగుణ, డీహెచ్.ఈ.డబ్ల్యూ. కోఆర్డినేటర్ దయా అరుణ, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వప్న, సీహెచ్ఎల్ కోఆర్డినేటర్ ఉమా, జెండర్ స్పెషలిస్ట్ జే.సుచరిత, సీహెచ్. స్వప్న, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్ట్ ఎస్.సంధ్యా రాణి, అకౌంటెంట్ ఎం. సమత, సంబంధిత అధికారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతారు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఓదెల కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో అదనపు కలెక్టర్, అధికారులు

ఓదెల, జనవరి 24 : లక్ష్యం ఉన్న ప్రతి విద్యార్థి చదువుతూనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అందిన సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన వైపు దృష్టి సారించాలని అన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నాణ్యత, పాఠశాల సౌకర్యాలు, ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుకాదేవి, తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో రాజయ్య, ఆర్ఐ రాజేందర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు : మాజీ మంత్రి కొప్పుల



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

ధర్మారం, జవవరి 24: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చూసి బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ధర్మారంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సవవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఓటములు, రాజీనామాలు పార్టీకి కొత్త కాదని కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు కేసులు పెడుతున్నారని, ఇందుకు కార్యకర్తలకు అండగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటు మీ వెంట ఉంటానని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితెందర్‌రావు, వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, మండల బీఆర్ఎప్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు రామారావు, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సింగరేణియన్‌గా జీఎం (కోఆర్డినేషన్) సురేష్



సురేష్

గోదావరిఖని, జనవరి 24: సింగరేణి వ్యాప్తంగా అత్యుత్తమ సేవలందించిన జీఎం(కోఆర్డినేషన్) సురేష్‌ను ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక చేసింది. ప్రతి ఏడాది రిపబ్లిక్‌డే సందర్భంగా ఏరియా నుంచి ఒకరిని ఉత్తమ అధికారిగా, అలాగే అన్ని ఏరియాల నుంచి అత్యుత్తమ అధికారుల్లో ఒకరిని ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక చేస్తారు. సింగరేణిలో 36సంవత్సరాలుగా సమర్థవంతమైన అధికారిగా పనిచేస్తున్న సురేష్‌కు ఈ అవార్డు లభించింది. గణతంత్ర వేడుకల్లో సీఎండీ బలరాంనాయక్ చేతుల మీదుగా సురేష్ ఈ అవార్డును అందుకోనున్నారు.

డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలి



డ్రైవర్లకు పువ్వులు అందజేస్తున్న ఎంవీఐ

మంథని, జనవరి 24: డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ తమ వాహనాలను నడపాలని పెద్దపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు సూచించారు. డ్రైవర్స్ డేను మంథని ఆర్టీసీ డిపోలో, ఆర్టీసీ బస్టాండ్, ఆటోస్టాండ్‌లో మంథని డిపో మేనేజర్ రాజశేఖరం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంవీఐ శ్రీనివాస్‌రావు ఆర్టీసీ, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూల మలుపులు వద్ద, వేరే బండి ఓవర్‌టేక్ చేసే సమయాల్లో డ్రైవర్లు చాలా జాగ్రత్తగా బండ్లను నడపాలన్నారు. అతివేగంగా కాకుండా వేగని యంత్రణను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవర్లు క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఎంతో జాగ్రత్తగా డ్రైవింగ్ చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లో, ఆటోస్టాండ్‌లో డ్రైవర్లకు గులాబీ పువ్వులను అందజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఎఫ్ రామస్వామి, ఆర్‌హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్టీఐ గోపాల్, బస్టాండ్ కంట్రోలర్ కేకే రెడ్డి, బస్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాం పూర్, జనవరి 24: మండల కేంద్రంలో బుధవారం జాతీయ భద్రత మాసోత్సవాలు జరిగాయి. ఏఎంవీఐ మధు, ఎస్ఐ శ్రీనివాస్‌లు ఆటో డ్రైవర్లు, వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అన్ని నియమాలు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపి అందరి కుటుంబాల్లో సుఖశాంతులు నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నీలిమ, కానిస్టేబుళ్లు రాజం, రజని ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

● మొదటి రోజు 422 మందికి 382మంది హాజరు

తిమ్మాపూర్, జనవరి24: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ మెయిన్స్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు తిరిగి ఈ నెల 27,29,30,31, ఫిబ్రవరి 1 వరకు జరగనున్నాయి. మొదటి రోజు జిల్లాలో కేవలం మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఒకే సెషన్‌లో పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మిగతా రోజుల్లో రెండు సెషన్‌లలో పేపర్ - 1 పరీక్ష నిర్వహించనున్నారు. పేపర్-2లో భాగంగా బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు జరిగాయి.

ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు రెండు గంటల ముందు నుంచి 12.30గంటల నుంచి విద్యార్థు లను అనుమతించారు. విద్యార్థులు తమవెంట అడ్మిట్ కార్డును, ఫొటో తో కూడిన ధ్రువీకరణ కోసం గుర్తింపు కార్డులను పరిశీలించి అనంత రం లోనికి అనుమతించారు. బుధవారం జరిగిన పరీక్షలకు 422 మం దికి 382మంది విద్యార్థులు హాజరు కాగా 40మంది విద్యార్థులు పరీ క్షకు గైర్హాజరైనట్లు ఎన్‌టీఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలి పారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

జమ్మికుంట రూరల్, జనవరి 24: జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రామడుగు సంపత్‌రావు ఇంట్లో విద్యుదాఘాతంతో నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పొలం పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లగా కొద్ది గంటల వ్యవధిలోనే ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వస్తున్నాయని స్థానికులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన వారు వచ్చేసరికే ఇంట్లోని నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొత్తం దగ్ధం అయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని, రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కుమార్ కోరారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చా యి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్‌ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

పెద్దపల్లి ఎంపీ టికెట్ స్థానిక మాదిగలకే ఇవ్వాలి

పెద్దపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ స్థానిక మాదిగలకే ఇవ్వాలని ఆల్ ఇండియా అంబెడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపెల్లి బాపన్న మంత్రి దామోదర్ రాజనరసింహకు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో మాదిగ చమర్స్ మేధావుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో మామిడిపెల్లి బాపన్న మాట్లాడుతూ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం అయిన పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను స్థానికంగా ఉండే కాంగ్రెస్ పార్టీలో కష్టపడుతున్న మాదిగకే ఇవ్వాలని మంత్రిని కోరారు. పెద్దపల్లిలో జనాభా దృష్ట్యా మాదిగలు అధికంగా ఉన్నా, ఇప్పటివరకు మాదిగలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రాలేదని, స్థానిక నాయకుడికి అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుక వెళతానన్నారు. ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్న వారికి అవకాశం ఇవ్వండి

సుల్తానాబాద్, జనవరి 24 : కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి వరప్రసాద్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌ని కలిసి కోరారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌ని కలిసి విన్నవించారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే వారికి టిక్కెట్ ఇవ్వాలని, స్థానికులకు అవకాశాలు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం ఉందని ఆమెకు కులాల వారిగా ఓటర్ల లిస్టును వివరించారు. పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ కేటాయించాలని విన్నవించారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేత

పెద్దపల్లిటౌన్, జనవరి 24: ప్రభుత్వ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం దాతలు దూడం కనకయ్య, వైద దశరథం, గండు వెంకటేశం, కొట్టే లక్ష్మయ్య, ఊట్ల అశోక్ కుమార్, చింతపండు కొమరయ్యల విరాళాలతో పట్టణంలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అన్నడి వెంకటరెడ్డి ఉపాధ్యక్షుడు కొమ్ము జగన్, ప్రధాన కార్యదర్శి సంపెల్లి వెంకటేశ్వరరావు ట్రెజరర్ సందీ సంపత్‌రెడ్డి తదితరులున్నారు.

ధర్మారాన్ని కమ్మేసిన పొగమంచు

ధర్మారం, జనవరి 24: ధర్మారం మండల కేంద్రాన్ని బుధవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచు కారణంగా చలి తీవ్రత ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 24: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్‌వో హనుమా నాయక్ బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే వారసమీక్ష భాగంగా ఆర్డీవో సమావేశమయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్ సేవలు మరవలేనివి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 : అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా జీవించిన కర్పూరి ఠాకూర్ సేవలు మరువలేనివని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు స్వామి వివేక్ పటేల్‌తో కలిసి పెద్దపల్లిలో జరిగిన కర్పూరి ఠాగూర్ శతజయంతిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రొడ్డ శ్రీనివాస్ పటేల్, కాల్వ శంకర్, అంజయ్య, బండి రఘు, రమేష్, కాలువ సదయ్య, మోత మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెద్దపల్లిటౌన్, జనవరి 24: జిల్లా కేంద్రంలో మంగళవారం గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తి పెద్దపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అమర్‌నగర్‌లో వెల్డింగ్ షాపులో పని చేస్తున్న అన్సారి గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నాడన్న సమాచారంతో తనిఖీ చేయగా అతని వద్ద 51 చాక్లెట్లు స్వాధీనం చేసుకొని అన్సారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి నుంచి తాను కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపాడు. తనకున్న వ్యసనం తీరడంతో పాటు ఇతరులకు విక్రయించడం ద్వారా సొమ్ము చేసుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఈ దందాకు దిగాడని ఎస్సై తెలిపారు.

విరసం మహాసభల కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 : విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు ఈనెల జనవరి 27,28 తేదీల్లో విజయవాడలో జరగనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో అమరవీరు స్థూపం వద్ద కరపత్రాలు, వాల్ పోస్టర్‌లను నాయకులు ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా విరసం కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, రాజగోపాల్, సుచరిత, నార వినోద్, బండారి రాజలింగయ్య, గుమ్మడి కొమురయ్య, గాండ్ల మల్లేషం, రాజు, మర్వాడి సుదర్శన్, వెల్తురు సదానందం, బాలకృష్ణ, పులిపాక రవిందర్, సమ్మయ్య, దినేష్, సాయి, గూళ్ల రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

ఓదెల, జనవరి 24 : మండలంలోని మడక ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవలనే బదిలీ అయిన ప్రధానోపాధ్యాయురాలు నరహరి సరితను బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మ్యాడగోని భాగ్యమ్మ, కొమురయ్య, పాఠశాల చైర్మన్ వెంకటరమణారెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఉపసర్పంచ్ కోట నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీ నోముల పద్మావతి, ఇంద్రారెడ్డి,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్,సాంబయ్యపద్మ ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సిద్దార్థతో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిపాలన తీరుపై విద్యార్థినులకు అవగాహన

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 : జిల్లాలో ప్రజలకు పరిపా లన ఏ విధంగా అందుతోందనే అంశంపై విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం వేడుకల అనంతరం బాలికలతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖలను సందర్శించి వాటి పనితీరును వివరించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కలెక్టర్ వ్యవస్థ ఉందని, గతంలో భూ పన్ను వసూలు చేసేందుకు ఈ వ్యవస్థను ఉపయోగించే వారని, మనకు స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సూచనల మేరకు మన దేశంలో ప్రజా అనుకూల పాలన అందించేందుకు దోహదపడేందుకు కలెక్టర్ల వ్యవస్థను కొనసాగించారని అన్నారు. ప్రస్తుతం ప్రజల ఆశయాల సాధన దిశగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని, ప్రజలకు వివిధ రకాల సేవలు ఒకే చోట నుంచి అందించాలనే ఉద్దేశంతో సమీకృత కలెక్టరేట్‌లను నిర్మించుకున్నామని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందే సేవలు, నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. అనంతరం పిల్లలతో కలిసి మ్యూజియంను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన చారిత్రక అంశాలను వివరించారు. సుమారు 20 కోట్ల సంవత్సరాల నుంచి 6 కోట్ల సంవత్సరాల క్రితం నాటి వృక్ష శిలాజాలు, డైనోసార్ ఎముక శిలాజాలు, చేప శిలాజాలు, పాతరాగి యుగం పనిముట్లు, శాతవాహన, బ్రిటీష్ కాలానికి చెందిన నాణేలు, మొదలైనవి మ్యూజియంలో ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. మన పెద్దపల్లి జిల్లాలో ప్రాముఖ్యమైన ప్రదేశాలకు సంబంధించిన ఫోటోలను కలెక్టర్ విద్యార్థులకు వివరించారు. జిల్లాలోని ప్రముఖమైన ప్రదేశాలకు విద్యార్థులను త్వరలో ఎడ్యుకేషన్ టూర్ తీసుకొని వెళ్లడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, సుల్తానాబాద్, అంతర్గాం కేజీబీవీ విద్యార్థునులు, సుల్తానాబాద్ సెయింట్ మెరిస్ స్కూల్ విద్యార్థినులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కమల

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ముత్తారం జనవరి 24: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వేడుకలను ప్రత్యేక అధికారి కమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఇంచార్జ్ కుమారి సునీత, రాధిక, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 24 : మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప, అంగన్‌వాడీ టీచర్‌లు శ్రీదేవి, దేవేంద్రలు చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- ఖనిలో ఏఐఎస్ఎఫ్ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోల్‌సిటీటౌన్, జనవరి 24: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో విద్యార్థుల నుంచి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తూ విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకు పోరాడాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేయాలని, విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నితీలేష్, ఎల్కపెల్లి సురేష్, మాతంగి సాగర్, సుస్మిత, శ్వేత, అరుణ, పవన్‌కళ్యాణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శికి ప్రశంసాపత్రం

కళ్యాణ్‌నగర్, జనవరి 24: యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పెద్దెల్లి తేజస్విప్రకాష్‌కు బుధవారం గాంధీభవన్‌లో ప్రశంసా పత్రాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డోర్ టు డోర్ ప్రచారం చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు పెద్దెల్లి తేజస్వినికి ఈ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, సురభి ద్వివేది, రహమాన్, రమేష్ బాబు ఉన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభను చాటిన విద్యార్థులు

మంథని, జనవరి 24: 2023-24 విద్యా సంవత్సరానికి ఆసియాలోనే అతిపెద్ద ఒలంపియాడ్ సంస్థ(ఎస్వోఎఫ్) నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలంపియాడ్(ఎన్ఎస్వో), ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్(ఐఎంవో) లెవెల్-1, 2లో స్థానిక కాకతీయ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావనిలు బుధవారం తెలిపారు. లెవల్-లో ఎన్ఎస్వోలో 37మంది, ఐఎంవోలో 79మంది, లెవెల్-2కి అర్హత సాధించినట్లు తెలిపారు. లెవెల్-1 ఐఎంవోలో 28 మంది మెడల్ ఆఫ్ డిస్టింక్షన్‌లు, 41మంది గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎన్ఎస్వోలో 63 మంది గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్. ప్రదీప్‌రెడ్డి విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాలకుర్తి, జనవరి 24: మండలం పరిధిలోని బసంత్‌నగర్ ఐఎమ్ఎస్ పాఠశాల విద్యార్థులు రావుల అక్షర, ఏం వర్షిత్, సత్యనారాయణ, కె ఆర్యన్‌లు ఈనెల 25 నుంచి 26 వరకు హైదరాబాదులో జరగబోయే ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ ఎం కృష్ణమూర్తిగౌడ్ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ మహేంద్ర, కేశోరాం సిమెంటు కంపెనీ అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆర్జీ-3,ఏపీఏలో ఉత్తమ అధికారులు, ఉద్యోగులు వీరే..

రామగిరి, జనవరి 24: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్ పరిధిలో ఉత్తమ అధికారులు, ఉద్యోగులను ఎంపిక చేస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో ఆర్జీ-3 నుంచి ప్రకాశ్‌లాల్ శర్మ(ఈపి ఆపరేటర్), ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీకి చెందిన అప్పల లక్ష్మీనారాయణ(హెడ్‌ఓవర్‌మెన్), ఓసీపీ-1కు చెందిన మాగంటి కాశివిశ్వేశ్వర్‌రావు, ఏఎల్‌పీకి చెందిన జనార్దన్, సాయిశ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు ఎంపికయ్యారు. వీరిని సెంట్రల్ ఫంక్షన్ హాల్ కొత్తగూడేంలో సత్కారం అందుకోనున్నారు. ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లకు చెందిన ఉత్తమ ఉద్యోగులు సుబ్బారావు, రూపేష్‌సింగ్, చంద్రయ్య, మల్లికార్జున్, రవికుమార్‌లను ఆర్జీ-3 డివిజన్‌లోని రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో గణతంత్ర వేడుకల్లో సత్కారం అందుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ

రామగిరి, జనవరి 24: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీ కాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో నిర్వహించతలపెట్టిన గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ పరిశీలించారు. గణతంత్ర వేడుకలకు సంబంధించిన పనులను సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేడుకల్లో ప్రతి కార్మిక కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఇన్‌చార్జి జీఎం కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు పద్మరాజు, కర్ణ, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, జనవరి 24: సింగరేణి రిటైర్డ్ కార్మికులు సర్వీస్ గ్రాట్యూటీ చెల్లింపు కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని, క్వార్టర్ అప్పగింత సమయంలో షెడ్లు కట్టుకున్నారని కొర్రీలు పెడుతూ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తోందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం ఆరోపించారు. బుధవారం స్థానిక భాస్కర్ భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో కార్మికులు 30,40ఏళ్లు సేవ చేసి పదవీవి విరమణ పొందిన వారిని, సీనియర్‌సిటీజన్లను జీఎం కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం అన్యాయమన్నారు. ఎప్పుడో కట్టిన డీ, టీ2 టైప్ క్వార్టర్లలో కుటుంబ అవసరాల నిమిత్తం సొంత ఖర్చులతో నిర్మించుకున్న వాటిని కంపెనీకి అప్పగించి ఆబ్జెక్షన్ లేకుండా అవసరమైతే హామీ పత్రం రాసి ఇచ్చినా వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఆర్‌జీ-1 అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. గ్రాట్యూటీ చట్టం ప్రకారం నెల రోజుల్లో గ్రాట్యూటీ చెల్లించాలని, కోల్ ఇండియా సర్క్యూలర్ ప్రకారం వెకేషన్‌తో సంబంధం లేకుండా గ్రాట్యూటీ చెల్లించాలని ఉన్నప్పటికీ యాజమాన్యం, అధికారులు ఇవేవి అమలుచేయకుండా రిటైర్డ్ కార్మికులను వేధిస్తున్నారన్నారు. యాజమాన్యం స్పందించి త్వరితగతిన ఇలాంటి కేసులను సెటిల్ చేయాలని గుర్తింపు సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. కారుణ్య నియామకాల్లో కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని, కౌన్సిలింగ్, విచారణ, మెడికల్ ఫిట్‌లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఫిట్ అయిన వారిని వెంటనే వీటీసీకి పంపి ట్రైనింగ్ పూర్తయిన వెంటనే పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 400మంది వారసులు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారని, వారిని తక్షణమే వీటిసి ట్రైనింగ్‌కు పంపాలని, లేదంటే ఆందోళనలు తప్పవని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గండి ప్రసాద్, ఎంఎ గౌస్, తాళ్లపెల్లి మల్లయ్య, విక్రం, చెప్యాల మహేందర్‌రావు, ఎర్రల రాజయ్య, గంగారపు చంద్రయ్య, తొడుపునూరి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

ఓసీపీ-3 స్టోర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 24: ఓసీపీ-3 స్టోర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు బుధవారం డీజీఎం రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు సుమారు 50 మంది వరకు పనిచేస్తున్నారని, మహిళలకు ప్రత్యేక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్టు నాయకులు డీజీఎంకు తెలిపారు. శుద్ధమైన తాగు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, అంతర్గత తారు రోడ్లు వేయాలని, రెస్ట్ హాల్ నిర్మించాలని కోరారు. పురుష, మహిళా కార్మికులకు వేర్వేరుగా టాయిలెట్లు లేకపోవడం సిగ్గుచేటైన విషయమని, వెంటనే మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మించాలని నాయకులు డీజీఎంను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజారత్నం, శంకర్, హుస్సేన్, చక్రపాణి, శ్రీకర్ ఉన్నారు.

ఏరియా వర్క్‌షాప్ కమిటీల పరిచయం

ఆర్జీ-2 ఏరియా ఏఐటీయూసీ నూతన కమిటీలను సీనియర్ నాయకులు డీజీఎం ఎర్రన్నకు పరిచయం చేశారు. వర్క్‌షాప్ పిట్ కమిటీతో పాటు మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులను పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, బ్రాంచి వైస్‌ప్రెసిడెంట్ అన్నారావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుర్రతిరుపతి, నాయకులు శ్యాంసన్, నారాయణ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంథని, జనవరి 24: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పీఏకు వినతిపత్రాన్ని అందజేసినట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి పర్మినెంట్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్లకొండ రాజయ్య, చిప్పకుర్తి చందు, సింగరపు గట్టయ్య, మల్లేష్, అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

మంథని, జనవరి 24: అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నేత సముద్రాల శ్రీనివాస్‌ను జడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని పుట్ట మధు అడిగి తెలుసున్నారు. వ్యక్తిగతంగా, పార్టీ పరంగా శ్రీనివాస్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామని పుట్ట మధు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కౌన్సెలర్లు గర్రెపల్లి సత్యనారాయణ, కాయితి సమ్మయ్య, నేతలు నక్క శంకర్, కొట్టె రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు అందజేత

రామగిరి, జనవరి 24: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలోని 144 మంది విద్యార్థులకు బుధవారం సౌమిత్రి తిరుమాలాచార్యులు, భార్య సుగుణమ్మ చేతుల మీదుగా రూ.35వేల విలువైన షూలు, సాక్సులను అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గంటపద్మ, ఎంపీటీసీ కొట్టెసందీప్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రీడి ఆర్ట్ ఫెస్టివల్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఆహ్వానం

రామగిరి, జనవరి 24: మంథని జేఎన్టీయూ కళాశాలలో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్.ఎస్.ఆర్.కృష్ణకు అగ్రదేశం నుంచి ఆహ్వానం అందింది. ఈనెల 24,25 తేదీల్లో అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించే అంతర్జాతీయ త్రీడీ ఆర్ట్ ఫెస్టివల్‌కు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, కళాశాల సిబ్బందిని కృష్ణను అభినందించారు.

మంత్రిని కలిసిన పన్నూరు ఎంపీటీసీ

రామగిరి, జనవరి 24: రామగిరి మండలంలోని పలు అభివృద్ధి పనుల విషయమై బుధవారం ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌ను పన్నూరు ఎంపీటీసీ చిందంమహేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ సిద్దం మురళీలు ధర్మపురిలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లలిత

పాలకుర్తి, జనవరి 24: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో గంగాల లలిత మాట్లాడుతూ గ్రామాల్లో నూతన చేతి పంపుల ఏర్పాటుకు, మరమ్మతుల కోసం, నీటి ఎద్దడిని తీర్చేందుకు మండలానికి 26,82,365 రూపాయల నిధులు మంజూరు అయ్యాయని వాటిని అవసరం ఉన్న చోట వినియోగించుకోవాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో షబ్బీర్ పాషా, సూపరింటెండెంట్ పూర్ణచందర్ రావు, సీనియర్ అసిస్టెంటు దాడి శ్రీనివాస్, ఎంపీటీసీలు గంగాధరి రమేష్ గౌడ్, దుర్గం కుమార్, అతీక్, ప్రియాంక, కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులను పరిశీలించిన ఎంపీడీవో

పాలకుర్తి, జనవరి 24: మండలం పరిధిలోని విమానాశ్రయం నుంచి ప్రధాన రహదారి వెంట జరుగుతున్న ఈజీఎస్ పనులను బుధవారం ఎంపీడీవో గంగాల లలిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పాలకుర్తి, జనవరి 24: పాలకుర్తి మండల పరిధిలోని జయ్యారం గ్రామానికి చెందిన మహమ్మద్ మదాసిర్ అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోగా బసంత్‌నగర్ పోలీసులు బుధవారం వెతికి అప్పగించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి బుధవారం అందజేశారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా రాజయ్య

పెద్దపల్లి రూరల్, జనవరి 24: మండలంలోని సబ్బితం గ్రామంలో బుధవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్ధ రాజయ్య, ఉపాధ్యక్షులుగా చుంచు చంద్రమౌళి, కోశాధికారిగా ఆకుల సతీష్, డైరెక్టర్‌లుగా తాళ్ల సతీష్, చుంచు పెద్దులు, కలవేన శ్రీనివాస్, బర్ల సదానందం, పోల్‌దాసరి అంజయ్య, భూతగడ్డ రాజమౌళిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సుల్తానాబాద్, జనవరి 24: విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ ఫాదర్ తుమ్మ జోసెఫ్ అశోక్ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో స్పోర్ట్స్‌డేని పురస్కరించుకుని ముందుగా ఒలంపిక్ టార్చ్‌ని వెలిగించి అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. గణతంత్ర వేడుకల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి పాలైన వారు తమ గెలుపుకు తొలి మెట్టుగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాదర్ వినయ్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, రాకేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ కార్యవర్గం

కళ్యాణ్‌నగర్, జనవరి 24: రామగుండం కార్పొరేషన్ ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా కండె కృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో 30అడ్డాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని ఏకగ్రీవంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే బాసిత్ పాషా, ప్రధాన కార్యదర్శి కండె కృష్ణ, అధికార ప్రతినిధిగా మణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప్పులేటి పర్వతాలు, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ఎండీ ముస్తాఫా, దీటి బాలరాజు, గట్ల రమేష్, మడిపెల్లి మల్లేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ముత్తారం, జనవరి 24: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ప్రవీణ రెడ్డి అన్నారు. పోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేసి పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేతెట్ల మహేందర్ యాదవ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కలికోట శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి వేణుమాధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరాజం, గ్రామ కార్యదర్శి జీవన్ ప్రసాద్ ,టీచర్స్ శ్రీనివాస్, రాజ్ కుమార్, దేవేందర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 24: కాల్వశ్రీరాంపూర్ మండంలోని పందిళ్ల గ్రామంలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం పాటలతో ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా వారు ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ రావి సదానందం, గ్రామ కార్యదర్శి ముజాహిద్ పాషా, కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కోంద్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, ధీకొండ శ్రావణ్, సలేంద్ర రాజన్న, సాయిళ్ల శ్రీనివాస్, కన్నూరి రేణుక, శ్రీవలి పాల్గొన్నారు.